సాక్షి
నిజామాబాద్
గురువారం । 12 । జూన్ । 2025



కాళేశ్వరం అక్రమాలపై..

ప్రభుత్వానికి దమ్ముంటే కాళేశ్వరం ప్రాజెక్ట్ అక్రమాలపై సీబీఐతో విచారణ చేయించాలని పాయల్ శంకర్ డిమాండ్ చేశారు.

- 8లో ▸



మత్తు పదార్థాల నిరోధానికి..

ప్రతిఒక్కరూ మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నిరోధానికి కృషి చేయాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అన్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
32.8 /21.9

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో అడపాదడపా ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

సెంట్రల్ జైలును సందర్శించిన జడ్జి



నిజామాబాద్ లీగల్ : సారంగాపూర్‌లోని సెంట్రల్ జైలును జిల్లా కోర్టు న్యాయమూర్తి జీవీఎస్ భరతలక్ష్మి బుధవారం సందర్శించారు. జైలులోని వివిధ విభాగాలను పరిశీలించిన జడ్జి.. ఖైదీలతో మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలు, లీగల్ ఎయిడ్ న్యాయవాదులు అందిస్తున్న న్యాయ సహాయం వివరాలు తెలుసుకున్నారు. ఖైదీలు తయా రు చేస్తున్న వస్తువులను పరిశీలించారు. జైలులో సౌకర్యాలపై న్యాయమూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. జడ్జి వెంట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఉదయ భాస్కర్‌రావు, జైలు సూపరింటెండెంట్ దశరథ్, జైలర్లు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, జైలు సిబ్బంది తదితరులున్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



ఖలీల్‌వాడి: అల్లర్లకు పాల్పడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించేందుకు ప్రయత్నించిన వారిపై నిఘా ఉంటుందని, అటువంటి వ్యక్తులు తమ నడవడికను మార్చుకోవాలని సీపీ సాయిచైతన్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లేనిపక్షంలో తగిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. పాతకక్షలను మనసులో పెట్టుకొని ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని సిర్నాపల్లిలో ఇటీవల మాజీద్ ఖాన్‌తోపాటు ఆయన కుటుంబ సభ్యులపై దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు. ఎవ్వరి వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలగించే లేదా సమాజంలో ఉద్రిక్తతలు రేపే విధంగా వ్యవహరించిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. శాంతియుత వాతావరణం కోసం పోలీస్‌శాఖ నిర్విరామంగా కృషి చేస్తుందని, దీనికోసం ప్రజల సహకారం ప్రధానమని పేర్కొన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారి సమాచారాన్ని దగ్గరలోని పోలీస్‌స్టేషన్లకు లేదా డయల్ 100, స్పెషల్ బ్రాంచ్ నంబర్ – 87126 59777, పోలీస్ కంట్రోల్ రూమ్ 08462 – 226090 నంబర్లకు తెలుపాలని, సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

బోధనా సామర్థ్యాలు మెరుగుపర్చుకోవాలి



మోపాల్(నిజామాబాద్‌రూరల్): గురుకులాల అధ్యాపకులు బోధనా సామర్థ్యాలు, మెలకువలను పెంపొందించుకుని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలను బోధించాలని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకులాల ఉమ్మడి జిల్లా ఆర్‌సీవో సత్యానాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని కంజర్ బీసీ గురుకులంలో జూనియర్ లెక్చరర్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా సత్యానాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. అధ్యాపకుల బోధనా సామర్థ్యాలను మెరుగుపర్చేందుకు ఓరియంటేషన్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాలోని 100 మంది అధ్యాపకులు పాల్గొన్నారు.

నేలకొరిగిన 150 ఏళ్ల రావి చెట్టు



నిజామాబాద్ నగరంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న శక్తి హనుమాన్ ఆలయ ఆవరణలో 150 ఏళ్ల నాటి రావి చెట్టు కూలింది. సోమవారం రాత్రి వీచిన భారీగాలులకు వృక్షం నేలకొరగడంతో ఆలయం స్వల్పంగా దెబ్బతిన్నట్లు పురోహితులు తెలిపారు. –సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

బడి గంట మోగింది..

నేటినుంచి పాఠశాలల పున: ప్రారంభం



సాలూర పీఎంశ్రీ జడ్పీహెచ్‌ఎస్ ముఖద్వారం.. పూలతోరణాలతో అలంకరణ

వేసవి సెలవుల అనంతరం గురువారం నుంచి పాఠశాలలు పున:ప్రారంభం కానున్నాయి. విద్యార్థులకు స్వాగతం పలికేందుకు కొత్త హంగులతో పాఠశాలలను ఇప్పటికే ఉపాధ్యాయులు సిద్ధం చేశారు. రంగులు వేసి, పూలతో అలంకరించి అందంగా తీర్చిదిద్దారు. మరోవైపు విద్యార్థులు సైతం నూతన విద్యాసంవత్సరంలోకి అడుగిడేందుకు ఉత్సాహంతో ఉన్నారు. ఈ నేపథ్యంలోఉత్తమ ఫలితాలు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న ప్రభుత్వ పాఠశాలలపై, ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించి స్ఫూర్తిగా నిలుస్తున్న పూర్వ విద్యార్థుల పరిచయాలతో ప్రత్యేక కథనాలు..

75 ఏళ్ల ప్రస్థానం..

- పూర్వవైభవం సంతరించుకుంటున్న సాలూర జడ్పీహెచ్‌ఎస్
- ప్రైవేట్‌కు దీటుగా పదో తరగతి పరీక్ష ఫలితాలు..
- ఉపాధ్యాయుల సమష్టి కృషి స్ఫూర్తిదాయకం



సాలూర పీఎంశ్రీ జడ్పీహెచ్‌ఎస్‌లో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

బోధన్ : సాలూర మండల కేంద్రంలో జడ్పీహెచ్‌ఎస్ ప్రారంభించి 75 ఏళ్లు పూర్తికావస్తోంది. అప్పట్లో పాఠశాలకు చుట్టూ ఉన్న 8 గ్రామాల విద్యార్థులు 6 నుంచి 10 వతరగతి వరకు చదువుకునేందుకు ఇక్కడి వచ్చి అడ్మిషన్ల కోసం పోటీ పడేవారు. ఈ పాఠశాలలో చదువుకున్న అనేక మంది పూర్వ విద్యార్థులు దేశ విదేశాల్లో వివిధ రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదిగారు. కాలక్రమంలో అనేక కారణాల వల్ల విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. తాజాగా పాఠశాల పరిస్థితులు మెరుగుపడి పూర్వ వైభవం సంతరించుకుంటున్న దశలో ఉంది. గురువారం కొత్త విద్యాసంవత్సరం ప్రారంభమవుతున్నందున పాఠశాల ముఖద్వారాన్ని పూల తోరణాలతో అలంకరించి తీర్చిదిద్దారు. ఈ పాఠశాల హెచ్‌ఎం రాజీ మంజూష స్థానిక మండల విద్యాశాఖ అధికారిణిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రైవేట్‌కు దీటుగా ఫలితాలు సాధిస్తూ పాఠశాల అభివృద్ధిపథంలో ముందుకెళ్తోంది.

నాణ్యమైన బోధన..

పాఠశాలలో మౌలిక సౌకర్యాలు సమకూర్చుకుంటూనే, నాణ్యమైన విద్యాబోధనకు హెచ్‌ఎం, ఉపాధ్యాయుల బృందం నిరంతరం చేస్తున్న కృషికి మంచి ఫలితాలు వస్తున్నాయి. రెండేళ్లుగా విద్యార్థుల సంఖ్య పెరుగుతూ ప్రస్తుతం 269 మందికి చేరింది. అన్ని సబ్జెక్టులను బోధించేందుకు సరిపడా ఉపాధ్యాయులున్నారు. ప్రభుత్వం కల్పించిన ఐఎఫ్‌పీ (ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్) ద్వారా డిజిటల్ విధానంలో పాఠ్యాంశాలను బోధిస్తున్నారు. ఇటీవల పీఎం శ్రీ పాఠశాలగా ఎంపికైంది. ఈ పథకం ద్వారా పాఠశాల అభివృద్ధికి నోచుకుంటోంది. అటల్ టింకరింగ్, కంప్యూటర్ ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఈ పథకం కింద విద్యార్థులను విజ్ఞాన యాత్రకు తీసుకెళ్తారు. శారీరక, మానసిక ఉల్లాసానికి విద్యార్థులకు యోగ, కరాటే, ఆటలు నేర్పిస్తున్నారు.

ప్రతిభచాటిన విద్యార్థులు

ఈ ఏడాది పదోతరగతి వార్షిక పరీక్షలో విద్యార్థులు 46 మందికిగాను 43 మంది మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. నేషనల్ మీన్స్‌కమ్ మెరిట్ స్కాలర్ షిప్‌నకు 8వ తరగతి విద్యార్థులు 8 మంది ఎంపికయ్యారు. జిల్లా సైన్స్‌ఫేర్‌లో పలువురు విద్యార్థులు ప్రతిభ చాటారు.

ఈ పాఠశాలలో 1971–72 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న సాలూరకు చెందిన ఇల్తెపు సాయన్న ఇండియన్ అయిల్ కార్పొరేషన్ లో సీనియర్ సైంటిస్ట్ (సీనియర్ మేనేజర్)గా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నాం. ప్రభుత్వం మౌలిక సౌకర్యాలు కల్పిస్తోంది. ఉపాధ్యాయ బృందం సమష్టి కృషితో విద్యార్థులు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధిస్తున్నారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి.

– రాజీ మంజూష, ఎంఈవో, హెచ్‌ఎం జెడ్పీహెచ్‌ఎస్ సాలూర

ప్రభుత్వ పాఠశాలలో చదివి ఐఏఎస్ అధికారిగా..

- ఉన్నత శిఖరాలకు ఎదిగిన పార్థసారథి
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా బాధ్యతల నిర్వహణ





ఆర్మూర్ : ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉన్నత స్థానాలకు ఎదిగిన చిట్ల పార్థ సారథి నేటి తరం విద్యార్థులకు ఆదర్శంగా నిలిస్తున్నారు. ఐఏఎస్ అధికారిగా వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వహించి పదవీ విరమణ పొందిన ఆయన ప్రతియేటా తాను పుట్టిన ఊరుకు, చదివిన పాఠశాలకు సేవా కార్యక్రమాలు చేయడంలో ముందుంటున్నారు.

పార్థసారథి పదో తరగతి వరకు ఆర్మూర్‌లోని జిరాయత్ నగర్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుకున్నారు. ఆర్డీవోగా, ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా, డీఆర్వోగా ఉద్యోగాలు చేశారు. యూపీఎస్సీ ప్రొసీజర్ ఆధారంగా 1993 బ్యాచ్ ఐఏఎస్ అధికారిగా ఎంపికై తన లక్ష్యాన్ని అందుకున్నారు. కలెక్టర్ గా, మార్క్‌ఫెడ్ ఎండీగా, ఐ అండ్ పీఆర్ కమిషనర్‌గా, చలన చిత్ర, టీవీ, నాటక రంగం సంస్థ ఎండీగా కొనసాగారు. తెలంగాణలో సివిల్ సప్లయీస్ కార్యదర్శిగా, తెలంగాణ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ గా అదనపు బాధ్యతలు నిర్వహించారు. పదవీ విరమణ అనంతరం 2020 సెప్టెంబర్‌లో తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా నియమించబడ్డారు.

సేవా కార్యక్రమాలు..

పార్థసారథి తన తల్లిదండ్రుల పేరిట చిట్ల ప్రమీల జీవన్ రాజ్ మెమోరియల్ ట్రస్టును ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతియేటా ఉన్నత ఫలితాలు సాధించిన విద్యార్థులకు బంగారు పతకాలను అందజేస్తున్నారు. విద్యార్థులను తరుచూ కలుస్తూ స్ఫూర్తి నింపుతున్నారు.

రుణం తీర్చుకోలేనిది..

కన్నతల్లి, సొంత ఊరు, చదివిన పాఠశాల రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిది. ప్రభుత్వ పాఠశాలల్లో సైతం పట్టుదలతో విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని ఆ లక్ష్య సాధన దిశగా కష్ట పడితే విజయం వారి సొంతమవుతుంది.

– చిట్ల పార్థ సారథి,

సరికొత్త హంగులతో..

మాక్లూర్ : మాక్లూర్ మండలంలోని మాణిక్‌బండార్, అమ్రాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక అలంకరణలు చేశారు. మానిక్‌బండార్‌లో 'మన ఊరు – మన బడి' కింద తరగతి గదులతో పాటు పాఠశాల అంతటికీ రంగులు వేశారు. 200 మంది విద్యార్థుల సంఖ్య ఉన్న ఈ పాఠశాల ఉత్తీర్ణతలోనూ ముందుంటోంది. పాఠశాల ఆవరణలో తాగునీటి కులాయిల వద్ద, మరుగుదొడ్లను ముందస్తుగా శుభ్రం చేయించారు. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, సురేశ్ తెలిపారు.

మరింత బలోపేతం చేస్తాం



ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా పాఠశాలల్లో విద్య అందుతోంది. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపించడానికి మొగ్గు చూపుతున్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయం. – కె. సత్యనారాయణ, ఎంఈవో, మాక్లూర్



మాణిక్‌బండార్ ప్రభుత్వ పాఠశాల

అడ్మిషన్లకు పోటీ..!

- రాష్ట్రంలోనే టాప్ టెన్ పాఠశాలల్లో ఒకటిగా గుర్తింపు
- 920 మంది విద్యార్థులతో కొనసాగుతున్న బోర్గాం(పి) జెడ్పీహెచ్‌ఎస్




మోపాల్(నిజామాబాద్‌రూరల్) : జిల్లాలోని అన్ని పాఠశాలలతో పోల్చితే బోర్గాం(పి) జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల భిన్నం. ఇతర గ్రామాల్లో అడ్మిషన్ల కోసం బడిబాటలో భాగంగా ఉపాధ్యాయులు, వీడీసీలు, యువజన సంఘాలతో కలిసి ఇంటింటికీ తిరిగితే.. ఈ పాఠశాలలో మాత్రం ఏప్రిల్ నుంచే అడ్మిషన్ల కోసం దరఖాస్తులు వెల్లువెత్తుతాయి. జిల్లాలో అడ్మిషన్ల కోసం పోటీ పడే ఏకైక ప్రభుత్వ పాఠశాల బోర్గాం(పి) జెడ్పీహెచ్‌ఎస్. 2025–26 సంవత్సరానికిగాను 240 పైగా దరఖాస్తులు వచ్చాయి. నేటి నుంచి దరఖాస్తులను పరిశీలించి సీటు ఇవ్వనున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలుసైతం అడ్మిషన్ల కోసం పోటీ పడతారు.

హెచ్‌ఎంలుగా చేసిన గద్దం గంగారెడ్డి (2006), పండరి సత్యనారాయణ (2012), నర్ర రామారావు (2019)లో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న చరిత్ర పాఠశాలకు ఉంది. హెచ్‌ఎంలతోపాటు ఉపాధ్యాయ బృందం నిబద్ధతతో పని చేస్తుండటం వల్లే పదోతరగతిలో ప్రతియేటా 95 శాతం వరకు ఫలితాలు వస్తున్నాయి. రాష్ట్రంలోనే టాప్ పది పాఠశాలల్లో బోర్గాం(పి) ఒకటి.

సీటు దొరకని విద్యార్థులెందరో..

ఈ విద్యాసంవత్సరానికిగాను 240 పైగా దరఖాస్తులు మే నాటికే వచ్చాయి. విద్యార్థులు టీసీలు తీసుకొచ్చిన తర్వాతే అడ్మిషన్లు ఇస్తున్నారు. ప్రస్తుతం దరఖాస్తులు తీసుకోవడంలేదు. ప్రతి ఏడాది ఎంతో మందికి సీటు దొరకడం లేదు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు క్రమశిక్షణ, నైతిక విలువలు నేర్పించడం పాఠశాల ప్రత్యేకత.

టీచర్లు, అటెండర్లను నియమించండి



- ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు వసూళ్లను నియంత్రించాలి
- లైబ్రరీల నిర్వహణపై దృష్టి సారించండి
- సాక్షి 'ఫోన్ ఇన్'లో డీఈవో అశోక్‌కు వినతులు
- సమస్యలు విన్నవెంటనే పరిష్కారం దిశగా ఆదేశాలిచ్చిన విద్యాశాఖాధికారి

సాక్షి ఫోన్ ఇన్

నిజామాబాద్ అర్బన్ : ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లు, అటెండర్లను నియమించాలని, ప్రైవేట్ స్కూళ్లలో ఫీజు వసూళ్లను నియంత్రించాలని పలువురు జిల్లా విద్యాశాఖాధికారి అశోక్‌ను కోరారు. వేసవి సెలవుల అనంతరం గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు, పరిష్కారమార్గాలు, నూతన విద్యా సంవత్సరంలో విద్యార్థుల మార్గదర్శకాల కోసం మాట్లాడేందుకు 'సాక్షి' ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఉదయం 11 నుంచి 12గంటల వరకు జిల్లాకు చెందిన పలువురు వివిధ అంశాలపై జిల్లా విద్యాశాఖాధికారితో మాట్లాడారిలా..

◆ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న భవనాల్లో ప్రైవే ట్ పాఠశాలలు కొనసాగుతున్నాయి. వాటిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు. – రామ్మోహన్, వర్ని

✤ అనుమతులు ఇచ్చే సమయంలోనే భవనాలు నిబంధనలకు అనుకూలంగా ఉన్నాయా? లేదా? పరిశీలిస్తాం. అగ్నిమాపక శాఖ, మున్సిపల్ అనుమతులను పరిశీలించిన తరువాత మేము అనుమతులిస్తాం. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న భవనాల్లో కొనసాగుతున్న పాఠశాలలకు నోటీసులు ఇస్తాం.

◆ అమ్మ ఆదర్శ పాఠశాలల బిల్లుల మంజూరు ఆలస్యమవుతోంది.. – రవి, కల్లూరు, ఎంపీటీసీ

✤ డీఈవో : పనులకు సంబంధించి వివరాలు తెలుసుకుని త్వరలోనే నిధులు విడుదల చేస్తాం.నిధుల కొరత ఎక్కడా లేదు. తక్షణమే అందించేందుకు ఆదేశాలు జారీ చేస్తా.

◆ శంకర్ భవన్‌లో టీచర్ల సంఖ్య తక్కువగా ఉంది.. – గోదావరి, శంకర్ భవన్ పాఠశాల చైర్మన్

✤ ప్రస్తుతం టీచర్ల సర్దుబాటు ప్రక్రియ కొనసాగుతోంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్లను నియమించడం జరుగుతుంది. సబ్జెక్టుల వారీగా అవసరమైన టీచర్లను నియమిస్తాం.

◆ మా పాఠశాలలో అటెండర్ లేరు. పాఠశాలకు ఓ స్వచ్ఛంద సంస్థ అందించిన కిటీకీలు అలాగే ఉండిపోయాయి. మూత్రశాలల నిర్వహణ సక్రమంగా లేదు. – వంశీ, జానకంపేట, వేల్పూర్ మండలం

✤ ప్రతి పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించడం జరిగింది. మీ పాఠశాలకు కూడా అందుబాటులో ఉన్నారు. అవసరమైతే మండల విద్యాశాఖ అధికారిని సంప్రదించి తెలుసుకుంటా. స్వచ్ఛంద సంస్థ అందించిన సామగ్రిని ఉపయోగంలోకి తీసుకువస్తాం.

◆ ప్రైవేట్ పాఠశాలల్లో ఎల్‌కేజీకి రూ.30వేల వరకు వసూలు చేస్తున్నారు. ఫీజు వసూళ్లను నియంత్రించండి. – నరేశ్, నిజామాబాద్

✤ ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు సంబంధించి గవర్నింగ్ బాడీ అందుబాటులో ఉంటుంది. కమిటీ సూచనల మేరకు ఫీజుల నిర్ణయం ఉంటుంది. అయినప్పటికీ ప్రైవేట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం. విద్యార్థుల తల్లిదండ్రులు సైతం విద్యాశాఖ దృష్టికి తీసుకురావాలి.

◆ వేల్పూర్ మండలం కుకునూర్ పాఠశాలలో పీఈటీ కొరత ఉంది. – ఆదెపు లింబాద్రి, నిజామాబాద్

✤ పాఠశాలకు పీఈటీ సర్దుబాటు చేస్తాం. సమీప పాఠశాలలో ఉన్న పీఈటీ అక్కడ కొనసాగే విధంగా చూస్తాం. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తాం.

◆ ఖలీల్‌వాడి పాఠశాలలో మూత్రశాలలు సక్రమంగా లేవు. – ఇర్ఫాన్, నిజామాబాద్

◆ ప్రభుత్వ పాఠశాలల్లో లైబ్రరీల నిర్వహణ సక్రమంగా లేదు. పుస్తకాలు అందుబాటులో లేవు. – రవి, ఆర్మూర్

✤ ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే లైబ్రరీలు కొనసాగుతున్నాయి. వాటిలో పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. నిర్వహణ తీరును పరిశీలించి మరింత బలోపేతం చేస్తాం.

◆ ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, ఇతర సామగ్రి విక్రయాలపై దృష్టిసారించండి. – మోహన్, డిచ్‌పల్లి

✤ ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, ఇతర సామగ్రి విక్రయాలపై దృష్టి సారిస్తాం. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకుంటాం.

✤ పాఠశాలను సందర్శించి మౌలిక సదుపాయాలను పరిశీలిస్తాం. నిధులు అందుబాటులో ఉన్నాయి. మూత్రశాలలు అవసరమైన చోట నిర్మిస్తాం. హెచ్‌ఎంల నుంచి ప్రతిపాదనలు తీసుకోవడం జరుగుతుంది.

◆ ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల అటెండెన్స్‌పై దృష్టి సారించాలి. ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాఠశాలలకు వెళ్లడం లేదు. – సంతోష్, నిజామాబాద్

✤ నిత్యం ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేస్తాం. గైర్హాజరైన టీచర్లపై చర్యలు తీసుకుంటాం. ఎవరికి మినహాయింపు ఉండదు. ప్రతి ఒక్కరూ పాఠశాల సమయంలో విద్యాబోధన చేపట్టాల్సిందే. పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేస్తాం.

◆ ప్రతిఏటా ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు సకాలంలో అందడం లేదు. – నితిన్, బోధన్

✤ ఈసారి ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాల పంపిణీ పకడ్బందీగా చేపడుతున్నాం. ఇప్పటికే పాఠ్యపుస్తకాలను పాఠశాలలకు అందించడం జరిగింది. మరికొన్ని పాఠశాలలకు పంపిణీ కొనసాగుతోంది. ఎక్కడా ఇబ్బందులు లేవు.

క్లుప్తంగా

సీఎస్‌ఐ బధిరుల పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభం

ఆర్మూర్‌: పట్టణంలోని మిషన్‌ కాంపౌండ్‌లో గల సీఎస్‌ఐ బధిరుల ఆశ్రమ పాఠశాలలో రాష్ట్ర వ్యాప్తంగా బధిర విద్యార్థుల నుంచి అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్‌ శాంతమూర్తి బుధవారం తెలిపారు. పదో తరగతి వరకు బాలబాలికలకు పాఠశాలతోపాటు హాస్టల్‌ సదుపాయం ఉంటుందన్నారు. బధిర విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలో చేర్పించాలని సూచించారు. వివరాలకు9951316138ను సంప్రదించాలన్నారు.

మహిళా గురుకుల కళాశాలలో..

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని సాంఘిక సంక్షేమ మహిళ గురుకుల డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం కోసం అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్‌ చంద్రిక ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ సంవత్సరంలో బీఎస్సీ (ఎంపీసీ, ఎంపీసీఎస్‌, ఎమ్మెస్సీఎస్‌, బీజెడ్‌సీ, ఎంబీజెడ్‌సీ), బీకాం (సీఏ, బీఏ),బీఏ (హెచ్‌ఈపీ) కోర్సులలో సీట్లు ఉన్నాయన్నారు. ఇంటర్‌ ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణులైన విద్యార్థినులు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థినులు పదో తరగతి, ఇంటర్‌ మెమో, బోనఫైడ్‌, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌ కార్డు జిరాక్స్‌తోపాటు మూడు పాస్‌పోర్ట్‌ సైజ్‌ ఫోటోలతో ఈనెల 23లోపు దరఖాస్తు చేయాలన్నారు. వివరాలకు 98665 86887, 99596 31207 నంబర్లను సంప్రదించాలన్నారు.

రెండో స్నాతకోత్సవానికి దరఖాస్తుల ఆహ్వానం

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో జూలై మూడో వారంలో జరిగే వర్సిటీ స్నాతకోత్సవానికి(కాన్వకేషన్‌) దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కంట్రోలర్‌ సంపత్‌కుమార్‌ ఒక ప్రకటనలో తెలిపారు. 2013–14 నుంచి 2022–23 విద్యాసంవత్సరం వరకు చదువు పూర్తయిన గ్రాడ్యుయేట్లు, బీఈడీ గ్రాడ్యుయేట్లు, పోస్టు గ్రాడ్యుయేట్లతో పాటు 30–06–2025 లోపు పీహెచ్‌డీ పొందిన వాళ్లు గతంలో దరఖాస్తు చేసుకోని వారు ఈనెలాఖరులోపు నిర్ణీత ఫారం ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. స్నాతకోత్సవ వేదికపై పీహెచ్‌డీ డిగ్రీలు, బంగారు పతకాలు మాత్రమే అందుకోవాలని మిగిలిన వారు కార్యాలయం నుంచి సర్టిఫికెట్స్‌ పొందవచ్చన్నారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూని వర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సంపత్‌కుమార్‌ సూచించారు.

కాలం చెల్లిన మందులు స్వాధీనం

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని జే.భూమేశ్వర్‌ ఫెర్టిలైజర్స్‌, సీడ్స్‌ అండ్‌ పెస్టిసైడ్స్‌ షాప్‌ నుంచి కాలం చెల్లిన మందులను స్వాధీనం చేసుకున్నట్లు ఏవో రమ్యశ్రీ తెలిపారు. బుధవారం ఫెర్టిలైజర్‌ షాపులో తనిఖీ చేయగా కాలం చెల్లిన పెస్టిసైడ్స్‌ మందులను గుర్తించామన్నారు. కాలం చెల్లిన మందులను రైతులకు విక్రయించకుండా స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. కేసు నమోదు చేసి చార్జ్‌షీట్‌ ఫైల్‌ చేస్తామని తెలిపారు.

సర్కారు బడుల్లో తగ్గుతున్న ప్రవేశాలు

- నామమాత్రంగానే కొనసాగుతున్న బడిబాట
- నేడు పాఠశాలల పునఃప్రారంభం



మోపాల్‌ మండలం సిర్‌పూర్‌లో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్‌)

నిజామాబాద్‌అర్బన్‌: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి ఏటా విద్యార్థుల ప్రవేశాలు తగ్గిపోతున్నాయి. ప్రతి ఏడాది బడిబాట కార్యక్రమం నిర్వహించినా ప్రవేశాలు మాత్రం నామమాత్రంగానే కొనసాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా విచ్చలవిడిగా ప్రైవేట్‌ పాఠశాలలు నెలకొల్పడం వల్ల ప్రభుత్వ పాఠశాలలకు ఇబ్బందికరంగా మారింది. వీటితో పాటు గురుకుల పాఠశాలలు కూడా మెరుగైన స్థితిలో ఉండడంతో ఇక్కడ ప్రవేశాలు పెరుగుతున్నాయి. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతు వస్తోంది.

38 పాఠశాలలు మూత

గత నాలుగేళ్లుగా విద్యార్థుల ప్రవేశాల సంఖ్య తగ్గుతుండడంతో 38 ప్రాథమిక పాఠశాలలు విద్యార్థులు లేక మూతపడ్డాయి. ప్రస్తుతం ఈ మూతపడిన పాఠశాలల ప్రాంతంలో బడిబాట కార్యక్రమం నిర్వహించి మళ్లీ వాటిని కొనసాగించేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఒక బడికి కిలోమీటర్‌ లోపు మరో పాఠశాల ఉండి విద్యార్థుల సంఖ్య అతితక్కువగా ఉంటే సమీప పాఠశాలకు బదలాయింపు చేస్తున్నారు. ఒక కిలోమీటర్‌కు మించి దూరంలో ఉంటే అదే ప్రాంతంలో కొనసాగేలా చర్యలు తీసుకుంటున్నారు.

28 పాఠశాలల్లోనే బడిబాట..

ప్రతి ఏటా పాఠశాలల పునఃప్రారంభ సమయంలో విద్యాశాఖ బడిబాట కార్యక్రమం నిర్వహిస్తోంది. ఈ ఏడాది ఈనెల 6 నుంచి బడిబాట కార్యక్రమం ప్రారంభించగా 11వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా కేవలం 28 పాఠశాలలు మాత్రమే ఈ కార్యక్రమం నిర్వహించాయి. ఇందులో 280 మంది విద్యార్థులను నూతనంగా చేర్పించారు. మిగిత పాఠశాలలు ఈ కార్యక్రమంపై నిర్లక్ష్యం చేశాయి. ఈనెల 19 వరకు బడిబాట కార్యక్రమం కొనసాగనుండగా ప్రధానంగా దృష్టిసారిస్తామని విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో 2021–22 విద్యాసంవత్సరం, 2022–23 విద్యాసంవత్సరంలో లోకల్‌ బాడీ పాఠశాలలకు సంబంధించి 157 మంది విద్యార్థులు తగ్గిపోయారు. 2023–24, 2024–25 విద్యాసంవత్సరంలో మధ్య కాలంలో 261 మంది విద్యార్థులు తగ్గిపోయారు. రాష్ట్ర పరిధిలోని ఐదు ప్రాథమిక పాఠశాలలు ఉండగా 2021–22 , 2022–23 విద్యాసంవత్సరంలో 71మంది విద్యార్థులు తగ్గిపోయారు. 2023–24,2024–25 విద్యాసంవత్సరంలో 21 మంది విద్యార్థులు తగ్గిపోయారు.

'ప్రయివేటు' జోరు..

జిల్లా వ్యాప్తంగా 477 ప్రయివేట్‌ పాఠశాలలు ఉండగా ఇందులో ప్రతి ఏటా ప్రవేశాలు పెరుగుతూ వస్తున్నాయి. 2021–22 విద్యాసంవత్సరంలో 1,19,271 మంది విద్యార్థులు ఉన్నారు. 2022–23లో 1,35,549 మంది విద్యార్థులు. 2023–24లో 1,53,016 మంది విద్యార్థులు. 2024–25లో 1,66,424 మంది విద్యార్థులు నమోదయ్యారు. మరోవైపు పాఠశాలల్లో ఎల్‌కేజీ స్థాయిలోనే రూ.వేలల్లో ఫీజులు వసూలు చేస్తున్నారు. ప్రత్యేక విద్యాబోధన పేరిట అదనపు ఫీజులు వసూలు చేస్తున్నారు. వీటితోపాటు పుస్తకాలు, వివిధ వస్తువుల విక్రయాలు చేపడుతున్నారు. అయినా తల్లిదండ్రులు విద్యార్థుల భవిష్యత్‌ కోసం ప్రయివేట్‌ బడులనే ఆశ్రయిస్తున్నారు.

మెరుగైన విద్యాబోధన అందిస్తాం..

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన అందిస్తాం. ప్రతి పాఠశాలపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నాం. బడుల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. టీచర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాం.

–అశోక్‌, డీఈవో, నిజామాబాద్‌

ప్రభుత్వ బడుల్లో అడ్మిషన్ల వివరాలు

మేనేజ్‌మెంట్‌	స్కూళ్లు	2021–22	2022–23	2023–24	2024–25
ప్రభుత్వ పాఠశాలలు	112	14,914	14,757	14,106	13,845
ప్రభుత్వ పాఠశాల (రాష్ట్ర పరిధి)	5	211	140	119	98
ఎంపీపీ, జెడ్పీ పాఠశాలలు	1039	99,152	86,391	75,539	70,119

'కాళేశ్వరం' అక్రమాలపై సీబీఐతో విచారణ చేయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆదిలాబాద్‌ ఎమ్మెల్యే పాయల్‌ శంకర్‌, పాల్గొన్న పార్టీ నాయకులు

సుభాష్‌నగర్‌: రాష్ట్రంలో కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ ఒకటేనని, ఈ ప్రభుత్వానికి దమ్ముంటే కాళేశ్వరం ప్రాజెక్ట్‌ అక్రమాలపై సీబీఐతో విచారణ చేయించాలని బీజేపీ శాసనసభా పక్ష ఉపనేత, ఆదిలాబాద్‌ ఎమ్మెల్యే పాయల్‌ శంకర్‌ డిమాండ్‌ చేశారు. కేంద్రంలో నరేంద్ర మోదీ పాలన 11ఏళ్లు పూర్తయిన సందర్భంగా నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఫొటో ఎగ్జిబిషన్‌, వివిధ రంగాల నిపుణులతో చర్చాగోష్టి కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాల్జేసిందని, అవినీతి, అక్రమాలకు పాల్పడిందని, ఆ పార్టీకి భవిష్యత్‌ లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు రూ.10.56లక్షల కోట్లు పదేళ్లలో ఇచ్చిందని, కేంద్ర నిధులతోనే గ్రామాల్లో, పట్టణాల్లో అనేక అభివృద్ధి పనులు చేపట్టారని గుర్తుచేశారు. ప్రధానమంత్రి ఆవాస్‌ యోజన నిధులు లేకుండా తెలంగాణలో ఒక్క ఇందిరమ్మ ఇల్లయినా నిర్మిస్తున్నారా అని ప్రశ్నించారు. నాయకులు మురళీధర్‌గౌడ్‌, న్యాలం రాజు, లక్ష్మీనారాయణ, నాగోళ్ల లక్ష్మీనారాయణ, ఇప్పకాయల కిషోర్‌, నాగరాజు, ఆనంద్‌రావు, తారక్‌ వేణు, మాస్టర్‌ శంకర్‌, సందీప్‌, నారాయణ యాదవ్‌, పడాల భూపతి, చిరంజీవి, విజయ్‌ కృష్ణ, హరీష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

షెడ్యూల్‌ ప్రకారం టీకాలు ఇవ్వాలి



కమ్మర్‌పల్లి: చిన్న పిల్లలకు షెడ్యూల్‌ ప్రకారం టీకాలు ఇవ్వాలని జిల్లా ఇమ్యూనైజేషన్‌ అధికారి అశోక్‌ అన్నారు. కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఇమ్యూనైజేషన్‌ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా పిల్లలకు ఇచ్చే వ్యాక్సిన్‌లను పరిశీలించారు. ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించి పిల్లల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వ్యాక్సిన్‌ మేనేజర్‌ తరుణ్‌, వైద్యాధికారి స్పందన, హెచ్‌ఈవో సత్యనారాయణ ఉన్నారు.

60 వసంతాల ఆర్మూర్‌ మార్కెట్‌ యార్డు

మీకు తెలుసా?



ఆర్మూర్‌ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌ యార్డు కార్యాలయం

ఆర్మూర్‌: ఆర్మూర్‌ ప్రాంతంలోని రైతాంగం పండించిన పంటను అమ్ముకోవడానికి అనువుగా ఆర్మూర్‌ పట్టణంలో 1965 జూలై 6న వ్యవసాయ మార్కెట్‌ యార్డును నెలకొల్పారు.

- రైతులు తమ పంటల విక్రయాలు నిర్వహించుకోవడానికి 11.07 ఎకరాల సువిశాలమైన స్థలంలో యార్డును ఏర్పాటు చేశారు.
- ఆర్మూర్‌ మార్కెట్‌ యార్డు స్థాపించిన సమయంలో ఆర్మూర్‌, బాల్కొండ, వేల్పూర్‌, భీమ్‌గల్‌, మోర్తాడ్‌, కమ్మర్‌పల్లి, సిరికొండ, జక్రాన్‌పల్లి మండలాలు ఈ యార్డు పరిధిలో ఉండేవి.
- ప్రస్తుతం ఆర్మూర్‌ నియోజకవర్గం పరిధిలోని ఆర్మూర్‌ మండలం, నిజామాబాద్‌ రూరల్‌ నియోజకవర్గం పరిధిలోని జక్రాన్‌పల్లి మండలం మాత్రమే ఉన్నాయి.
- ఏఎంసీ పరిధిలో వెయ్యి మెట్రిక్‌ టన్నుల గోదాం, 600 మెట్రిక్‌ టన్నుల గోదాం, 200 మెట్రిక్‌ టన్నుల గోదాములు ఉన్నాయి. వెయ్యి మెట్రిక్‌ టన్నుల గోదామును సివిల్‌ సప్లై వారికి అద్దెకు కేటాయించారు. మిగిలిన రెండు గోదాములు ఐడీసీఎంఎస్‌ వారు అద్దెకు తీసుకున్నారు.

సారూ.. బడిలోకి ఎలా వెళ్లాలి?



నవీపేట జెడ్పీ బాలుర పాఠశాల ఆవరణలో మొరం కుప్పలు, నిలిచిన వర్షపునీరు

- అధ్వానంగా మారిన నవీపేట జెడ్పీ బాలుర పాఠశాల ఆవరణ
- మొరం కుప్పలు, వర్షపు నీటితో బడిలోకి వెళ్లలేని పరిస్థితి

నవీపేట: వేసవి సెలవుల అనంతరం నేడు బడులు తెరుచుకోనున్నాయి. ఈక్రమంలో సర్కార్‌ బడుల్లో ప్రవేశాల సంఖ్యను పెంచడానికి, విద్యార్థులను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. కొత్త విద్యార్థులకు హంగుఆర్భాటాలతో స్వాగతం పలికేందుకు పాఠశాలలను ఉపాధ్యాయులు ముస్తాబు చేస్తున్నారు. కానీ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మాత్రం విద్యార్థులు లోనికి రాకుండా మొరం కుప్పలు, వర్షపు నీటితో అధ్వానంగా మారింది. బడిబాటలో భాగంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేసిన ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి పాఠశాల గొప్పతనాన్ని వివరించారు. ప్రవేశాల సంఖ్య పెంచడానికి కృషి చేశారు. కానీ బడుల పునఃప్రారంభం రోజే బడి ఆవరణ ఇలా వర్షపు నీరు, మొరం కుప్పలతో నిండి ఉండడంతో పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల అలసత్వం..

ఇటీవల నవీపేటకు వచ్చిన ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి దృష్టికి బడి సమస్యను తీసుకెళ్లగా స్పందించారు. మొరం భర్తీకి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇవ్వడంతో అధికారులు ముందుకువచ్చారు. కానీ వారు ఆలస్యంగా పనులు ప్రారంభించడంతో కొద్దిమేర మొరం కుప్పలను వేశారు. కుప్పలను చదును చేసేందుకు వీలున్నా అధికారులు అటువైపు వెళ్లలేదు. దీంతో బడి ఆవరణలో మొరం కుప్పలు అలాగే ఉండిపోయాయి.

మత్తు పదార్థాల నిరోధానికి కృషి చేయాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

నిజామాబాద్‌ అర్బన్‌: ప్రతిఒక్కరూ మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిరోధానికి కృషి చేయాలని, వీటిపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అదనపు కలెక్టర్‌ కిరణ్‌ కుమార్‌ సూచించారు. ఈమేరకు యాంటీ నార్కోటిక్స్‌ బ్యూరో ఆధ్వర్యంలో రూపొందించిన గోడ ప్రతులు, కరపత్రాలను బుధవారం అదనపు కలెక్టర్‌ కిరణ్‌ కుమార్‌ తన ఛాంబర్లో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రభుత్వం కూడా ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తూ అనేక చర్యలు చేపడుతోందన్నారు. ఎక్కడైనా గంజాయి, క్లోరల్‌ హైడ్రేట్‌, డైజోఫామ్‌, అల్ప్రాజోలం వంటి వాటి రవాణా, విక్రయాలు జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే సంబంధిత శాఖల అధికారులకు సమాచారం అందించాలని, టోల్‌ ఫ్రీ నంబర్‌ 1908కు ఫోన్‌ చేసి సమాచారం తెలియజేయవచ్చన్నారు. నిజామాబాద్‌ జోన్‌ డీఎస్పీ సోమనాథం మాట్లాడుతూ.. ఇటీవలి కాలంలో సుమారు రూ. 42.98 కోట్ల విలువ చేసే అల్ప్రాజోలం నిల్వలను సీజ్‌ చేసినట్లు తెలిపారు. జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

వివాహేతర సంబంధమే కారణం

- చిన్నకొడప్‌గల్‌ జీపీ కార్యదర్శి హత్య కేసును ఛేదించిన పోలీసులు
- నలుగురు నిందితుల అరెస్ట్‌
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రాజేశ్‌ చంద్ర



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాజేశ్‌ చంద్ర



హత్యకు ఉపయోగించిన ఆయుధాలు

కామారెడ్డి క్రైం: ఇటీవల హత్యకు గురైన చిన్నకొడప్‌గల్‌ జీపీ కార్యదర్శి దరావత్‌ కృష్ణ కేసును పోలీసులు ఛేదించారు. హత్యకు వివాహేతర సంబంధమే కారణమని తేల్చారు. ఈమేరకు బుధవారం జిల్లాకేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రాజేశ్‌చంద్ర వివరాలు వెల్లడించారు. పిట్లం మండలం రూప్‌ తండాకు చెందిన దరావత్‌ కృష్ణ (28) చిన్న కొడప్‌గల్‌ పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తుండేవాడు. చిన్నకొడప్‌గల్‌కు చెందిన లింగంపేట మల్కయ్య అలియాస్‌ మల్కన్న ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌ వెళ్లి ఇటీవల ఇంటికి వచ్చాడు. తన భార్య సుజాతకు పంచాయతీ కార్యదర్శి కృష్ణతో వివాహేతర సంబంధం ఏర్పడిందని గుర్తించాడు. ఈ విషయంలో భార్యతో తరచుగా గొడవపడేవాడు.చివరికి తమ సంసారం చక్కబెట్టుకోవాలని భార్యాభర్తలు నిర్ణయించుకొని, కృష్ణను చంపాలనుకున్నారు. ఇందుకోసం తమ కులస్తులైన ఏరనోళ్ల బాల్‌రాజ్‌, మల్కయ్యల సహాయం తీసుకున్నారు. ఈనెల 5న సుజాత ద్వారా కృష్ణను ఇంటికి పిలిపించుకుని నలుగురూ కలిసి కత్తి, గొడ్డలి ఇనుపరాడ్డులతో కొట్టి చంపారు. ఆపై మృతదేహాన్ని, కృష్ణ బైక్‌ను సమీపంలోని రెడ్డి చెరువులో పడవేశారు. 7న గాయాలతో కూడిన కృష్ణ మృతదేహాన్ని రెడ్డి చెరువులో పోలీసులు గుర్తించారు. విచారణ చేపట్టి నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు ఎస్పీ తెలిపారు. వారిని రిమాండ్‌కు తరలిస్తున్నామని వెల్లడించారు. హత్య కేసును ఛేదించిన బాన్సువాడ డీఎస్పీ విఠల్‌ రెడ్డి, రూరల్‌ సీఐ రాజేష్‌, పిట్లం ఎస్సై రాజును ఆయన అభినందించారు.

అయిల్‌ పాం కోతలు షురూ..



బాల్కొండ: ముప్కాల్‌ మండలం నాగంపేట్‌ గ్రామంలో అయిల్‌పాం పంట కోతలను బుధవారం రైతులు ప్రారంభించారు. రెండేళ్ల క్రితం సాగు చేసిన అయిల్‌పాం చెట్ల నుంచి ప్రస్తుతం గోలలు కోత కోశారు. రైతు బద్దం ముత్యంరెడ్డి సాగు చేసిన రెండు ఎకరాల అయిల్‌ పాం తోట నుంచి 1.3 టన్నుల దిగుబడి వచ్చిందని ఉద్యానవన అధికారి రుద్ర వినాయక్‌ తెలిపారు. టన్నుకు రూ.18,748 ధర పలుకుతుందన్నారు. పంట దిగుబడి రావడం పై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్రైం కార్నర్

కరెంట్‌ షాక్‌తో బాలుడి మృతి



గోవర్ధన్‌ (ఫైల్‌)

బాన్సువాడ రూరల్‌: మండలంలోని ఇబ్రహీంపేట్‌ గ్రామంలో ఓ బాలుడు కరెంట్‌ షాక్‌తో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. ఇబ్రాహీంపేట్‌ గ్రామం గంగపుత్ర కాలనీకి చెందిన దుబాయ్‌ సాయిలుకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు గోవర్ధన్‌(13), భార్య గంగవ్వ ఉన్నారు. ఇద్దరు కూతుళ్లకు పెళ్లిళ్లు జరుగగా, సాయిలు ఉపాధి నిమిత్తం మలేషియా వెళ్లాడు. ఇంటివద్ద భార్య గంగవ్వ, కుమారుడు గోవర్ధన్‌ ఉంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలు, ఈదురుగాలులకు వారి పెంకుటిళ్లు ముందర వేసిన రేకుల షెడ్డు ఇనుప పైప్‌కు విద్యుత్‌ వైర్లు తగిలి కరెంట్‌ సరఫరా అయ్యింది. దీన్ని గమనించని గోవర్ధన్‌ బుధవారం బయట ఆడుకుంటున్న సమయంలో ఇనుపపైప్‌కు తాకడంతో కరెంట్‌షాక్‌తో విగతజీవిగా మారాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని బాన్సువాడ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తల్లి గంగవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మలేషియాలో ఉన్న తండ్రి సాయిలుకు ఫోన్‌లో సమాచారం అందించగా,కుమారుడి కడచూపుకు వస్తానని చెప్పడంతో అంత్యక్రియలు నిర్వహించలేదు. విద్యార్థి మృతిపట్ల ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ కాసుల బాలరాజు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

మోపాల్‌ మండలంలో..

మోపాల్‌: మండలంలోని న్యాల్‌కల్‌లో ఓ బాలుడు కరెంట్‌షాక్‌తో మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన రాజు–మమత దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడైన శ్రీ వర్షిత్‌ (9) నగరంలోని ఓ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. బుధవారం వారి ఇంటి వద్ద ఆడుకుంటున్న శ్రీ వర్షిత్‌కు తెగిపడ్డ బోరు మోటారు సర్వీస్‌ వైరు తగిలి విద్యుత్‌షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందాడు.

లారీ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి..

వేల్పూర్‌: మండలంలోని అంక్సాపూర్‌ గ్రామ సమీపంలో 63వ నంబరు జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు ఎస్సై సంజీవ్‌ తెలిపారు. మోర్తాడ్‌ వైపు బైక్‌పై వెళ్తున్న సదరు వ్యక్తిని ఆర్మూర్‌ వైపు వెళ్తున్న లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేవన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆర్మూర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కువైట్‌లో గుండెపోటుతో మిట్టాపల్లి వాసి ..



గంగాధర్‌ (ఫైల్‌)

డిచ్‌పల్లి: మండలంలోని మిట్టాపల్లి గ్రామానికి చెందిన సిర్నాపల్లి గంగాధర్‌ (45) బతుకుదెరువు కోసం కువైట్‌ దేశానికి వెళ్లగా, రెండు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గంగాధర్‌ ఐదేళ్ల క్రితం కువైట్‌ దేశానికి వెళ్లగా, గతంలో ఒకసారి గుండెపోటు రావడంతో చికిత్స పొందాడు. సెలవుపై స్వగ్రామానికి వచ్చి రెండు నెలల క్రితం తిరిగి వెళ్లాడు. రెండు రోజుల క్రితం డ్యూటీలో ఉండగా మరోసారి గుండెపోటు రావడంతో ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతివార్త కుటుంబసభ్యులకు తెలియడంతో వారు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతుడికి తల్లిదండ్రులు, భార్య, ఒక కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతదేహాన్ని వీలైనంత త్వరగా స్వగ్రామానికి రప్పించేలా రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ప్రభుత్వం కృషి చేయాలని, మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ కాపర్‌, ఆయిల్‌ చోరీ

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌లోని లక్ష్మి లిఫ్టు కోసం ముప్కాల్‌ మండలం నల్లూర్‌ శివారులో నిర్మించిన సబ్‌స్టేషన్‌ నుంచి ట్రాన్స్‌ఫార్మర్‌ కాపర్‌ కాయిల్స్‌, ఆయిల్‌ చోరీకి గురైంది. లిఫ్టు ఆపరేటర్‌ భానుచందర్‌ బుధవారం ఉదయం సబ్‌స్టేషన్‌ వద్దకు వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. దీనిపై బుధవారం ఆర్మూర్‌ ఏసీపీ వెంకటేశ్వర్లు, ఆర్మూర్‌ రూరల్‌ సీఐ శ్రీధర్‌ రెడ్డి, ముప్కాల్‌ ఎస్సై రజనీకాంత్‌ విచారణ చేపట్టారు. మే31 నుంచి జూన్‌ 10 మధ్య కాలంలో చోరీ జరిగినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దుండగులు రెండు ట్రాన్స్‌ఫార్మర్లను కింద పడేసి కాపర్‌ కాయిల్స్‌, ఆయిల్‌ ఎత్తుకెళ్లారు. లక్ష్మి లిఫ్టు డిప్యూటీ ఈఈ సురేశ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి అదృశ్యం



విక్కీ

నవీపేట: మండల కేంద్రంలోని శివాజీనగర్‌కు చెందిన వగిరె విక్కీ(25)అదృశ్యమైనట్లు ఎస్సై వినయ్‌ బుధవారం తెలిపారు. గత కొంతకాలంగా మద్యానికి బానిసైన విక్కీ మతిస్థిమితం కోల్పోయాడన్నారు. ఈనెల 9న ఇంటి నుంచి బయటకు వెళ్లిన విక్కీ మళ్లీ ఇంటికి తిరిగిరాలేదు. దీంతో అతడి భార్య నాగలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

చెట్టును ఢీకొన్న కారు: డ్రైవర్‌కు గాయాలు



మాక్లూర్‌: మండలంలోని చిక్కిలి గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని చిక్కిలి, బ్రిలియంట్‌ పాఠశాల మార్గమధ్యలో ఉన్న మూలమలుపు వద్ద మంగళవారం రాత్రి ఓ కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ముందు భాగం నుజ్జునుజ్జు కాగా డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కారు నందిపేట్‌ మండలం కంఠం గ్రామానికి చెందినదిగా తెలిసింది.

బైక్‌ల చోరీ కేసులో నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ఖలీల్‌వాడి: బైక్‌ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్‌ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఏసీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి, టాస్క్‌ఫోర్స్‌ ఏసీపీ నాగేంద్రచారి వివరాలు వెల్లడించారు. నగరంలోని ఒకటో టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో బుధవారం ఉదయం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరిని పట్టుకున్నారు. వారిని విచారించగా బైక్‌లను దొంగతనాలు చేసినట్లు తెలిపారు. నిందితులు బోధన్‌ పట్టణానికి చెందిన మాలోత్‌ రమేష్‌, కటం రవిగా గుర్తించారు. నిందితులు బాసర్‌ రైల్వే స్టేషన్‌లో ఒక బైక్‌, తిర్మన్‌పల్లి గ్రామంలో ఒక బైక్‌, వికారాబాద్‌ జిల్లా తాండూరు పట్టణంలో ఒకటి, నిజామాబాద్‌ పట్టణంలో మూడు బైకులను చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు గతంలో బైక్‌ చోరీ కేసులో జైలుకు వెళ్లివచ్చినట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి జైలుకు తరలించినట్లు తెలిపారు.ఎస్‌హెచ్‌వో రఘుపతి,తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్‌ గ్యాంగ్‌ సభ్యుడు..

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని ఓ హోటల్‌ వద్ద ఆటో డ్రైవర్‌ను బెదిరింపులకు పాల్పడిన కేసులో రౌడీషీటర్‌ బర్సాత్‌ ఆమీర్‌ అనుచరుడు ఇర్ఫాన్‌ను అరెస్ట్‌ చేసినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి బుధవారం తెలిపారు. ఇర్ఫాన్‌ నుంచి ఒక తల్వార్‌, రెండు కత్తులు, రెండు పంచ్‌లు, 50 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బర్సాత్‌ అమీర్‌తోపాటు మరో 10 మంది పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఇర్ఫాన్‌ను రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

పేకాడుతున్న 10మంది..

ఖలీల్‌వాడి: నగరంలోని గౌతమ్‌నగర్‌లో విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేశారు. పేకాడుతున్న 10 మందిని అరెస్ట్‌ చేశారు. 8సెల్‌ఫోన్లు, రూ. 5660 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై హరిబాబు తెలిపారు.